సాక్షి
నిర్మల్

శనివారం । 30 । నవంబర్ । 2024

బాసరలో కార్తిక వేడుకలు

బాసర: నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞానసరస్వతి అమ్మ వారి ఆలయంలో శుక్రవారం శ్రీవాగ్దేవి వాయిద్య సంస్థ, నట మయూరి డాన్స్ అకాడమీ సంగీత కళానృత్య సాంస్కృతిక కళాకారులు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శించారు. కార్తిక శుక్రవారం సందర్భంగా సరస్వతి, మహాకాళి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు.



- కాగజ్‌నగర్‌లో మహిళపై దాడి..
- తీవ్రంగా గాయపడి బాధితురాలు మృతి
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న బెబ్బులి సంచారం
- భయంతో వణుకుతున్న అటవీ సమీప గ్రామాల ప్రజలు
- వరుస ఘటనలు జరుగుతున్నా మేల్కోని అటవీశాఖ
- అనవసరపు గోప్యతతో దాడులు

పులి పంజా..

శీతాకాలం వచ్చిందంటే.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చలితో గజగజ వణుకుతుంది. ప్రస్తుతం కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకన్నా తక్కువగా నమోదవుతున్నాయి. ఒకవైపు చలి వణికిస్తుండగా మరోవైపు పెద్ద పులులు అటవీ సమీప గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నెలరోజులుగా ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో పెద్దపులులు, చిరుత పులుల సంచారం పెరిగింది. నిన్నటి వరకు పశువులు, మేకలపై దాడిచేసి హతమార్చాయి. తాజాగా ఓ పులి మహిళపై పంజా విసిరింది. పత్తి చేనులో పనికి వెళ్లిన మహిళ పత్తి ఏరుతుండగా.. అక్కడే మాటువేసి ఉన్న పులి దాడి చేసింది. మెడ భాగంలో కొరకడంతో తీవ్రంగా గాయపడింది. తోటి కూలీలు, స్థానిక ప్రజలు కేకలు వేయడంతో వదిలేసి పారిపోయింది. తీవ్రగాయాలు, రక్తస్రావంతో మహిళ మృత్యువాతపడింది.



ఘటన స్థలంలో రక్తం, పత్తి

లక్ష్మి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: ఉమ్మడి జిల్లాలో పెద్దపులులు దడ పుట్టిస్తున్నాయి. తరచూ పశువులు, మనుషులపై దాడులకు దిగుతూ కలకలం సృష్టిస్తున్నాయి. తాజాగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం.11, 13 గ్రామాల మధ్య పత్తి తీయడానికి వెళ్లిన గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి(21)పై పులి దాడి చేసి హతమార్చడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు ఉలిక్కిపడ్డారు. వరుస ఘటనలు జరుగుతున్నా అటవీశాఖ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

కాగజ్‌నగర్ డివిజన్‌లో పులుల ఉనికి

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో విశాలమైన అడవులు ఉన్నాయి. అరుదైన జంతువులకు అనువైన ప్రాంతం. ఈ నేపథ్యంలోనే కాగజ్‌నగర్ డివిజన్‌ను కన్జర్వేటివ్ రిజర్వుగా గుర్తించారు. ఈ డివిజన్ మహారాష్ట్రలోని తాడోబా పులుల రక్షిత అభయారణ్యానికి అనుసంధానంగా ఉంది. కాగజ్‌నగర్ అటవీ డివిజన్‌లో పులులు స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడంతో కాగజ్‌నగర్ డివిజన్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. రికార్డుల ప్రకారం ఇక్కడ 8 నుంచి 11 పులు లు ఉన్నట్లుగా అంచనా. గతేడాది వరుసగా రెండు పులులు చనిపోయాయి. మహారాష్ట్ర నుంచి తోడు కోసం వచ్చిన కొత్తపులి మహిళపై దాడి చేసి హతమార్చిందని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిత్యకృత్యంగా మారిన దాడులు

ఉమ్మడి జిల్లాలో వన్యప్రాణుల దాడులు నిత్యకృత్యంగా మారాయి. 2022 నవంబర్‌లో వాంకిడి మండలం చౌపన్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సిడాం భీము(69)పై పులిదాడి చేసి హతమార్చింది. 2020 నవంబర్ 11న దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విఘ్నేష్(23), అదే ఏడాది నవంబర్ 19న పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల(16) పులిదాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌లో మహారాష్ట్ర నుంచి వచ్చిన ఏనుగు హల్‌చల్ చేసింది. చింతలమానెపల్లి మండలం బూరేపల్లి వద్ద ఒకరిని, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి వద్ద మరొకరిని చంపింది. తాజాగా శుక్రవారం కాగజ్‌నగర్ మండలం గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి పెద్దపులి దాడిలో ప్రాణాలు కోల్పోయింది. ప్రభుత్వం కవ్వాల్ టైగర్ రిజర్వుకు ప్రాధాన్యతను ఇస్తున్నా కాగజ్‌నగర్ డివిజన్‌లో వన్యప్రాణుల ఉనికి ఎక్కువగా ఉండటం గమనార్హం.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

గోప్యత పాటించడంతోనే..

పెద్దపులుల దాడులు పెరుగుతున్నా అటవీ జంతువుల కదలికలు తెలుసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా నవంబర్‌లో సహజంగా పులులు తోడు కోసం తిరుగుతుంటాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో ప్రాణనష్టం జరిగినప్పటికీ ప్రమాదాలను నివారించడంలో విఫలమవుతున్నారు. పులికి ఉన్న ప్రత్యేకమైన అలవాట్లు, జీవించే విధానంతో అధికారులు పులి కదలికలను అంచనా వేస్తారు. కాగజ్‌నగర్ డివిజన్‌లో పులి కదలికలు ఉన్నా అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదు. కన్జర్వేటివ్ రిజర్వుగా గుర్తించినా అభివృద్ధి కనిపించలేదు. అధికారులు గోప్యత పాటించడంతోనే అనర్థాలు జరుగుతున్నాయని స్పష్టమవుతోంది. తాజాగా ఘటన జరిగిన నజ్రూల్‌నగర్‌లో గతంలోనూ పులి కదలికలు ఉన్నాయి. శుక్రవారం ఉదయం పలువురు విద్యార్థులు పులిని గుర్తించారు. అటవీశాఖకు సమాచారం ఉన్నా అప్రమత్తం చేయలేదు. గతంలోనూ ఎఫ్‌డీవో స్వయంగా పర్యవేక్షిస్తుండగానే పెంచికల్‌పేట్‌లో ఏనుగు దాడిలో ఒకరు మృతి చెందారు. ఉన్నతస్థాయి అధికారులు, సిబ్బందికి సమన్వయం లేకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అనవసర గోప్యత పాటిస్తూ ప్రజలను అప్రమత్తం చేయకపోవడంతో ప్రాణనష్టం జరుగుతోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని, వన్యప్రాణుల దాడి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మందపై చిరుత దాడి

- మూడు గొర్రెలు హతం..
- ఓ మేకను ఎత్తుకెళ్లిన వైనం..
- బాబెరతండాలో ఘటన

బోథ్: మండలంలోని బాబెరతండా (లంబాడితండా) గ్రామంలోకి శుక్రవారం వేకువజాము న 2.30 గంటల ప్రాంతంలో ఓ చిరుత వచ్చింది. అవునూరి రమేశ్‌కు చెందిన మేకల మంద ఉన్న పాకలోకి ప్రవేశించింది. అందులో మూడు గొర్రెలు, ఒక మేకపై దాడి చేసింది. మరో మేక ను ఎత్తుకెళ్లింది. ఈ క్రమంలో జీవా ల అరుపులతో యజమానితో పాటు స్థానికులు బయటకు వచ్చి పాక వద్దకు చేరుకున్నారు. అ ప్పటికే మూడు గొర్రెలు మృతి చెందగా.. ఓ మేక కనిపించలేదు. గొర్రెలపై ఉన్న గాయాలు చూ సి చిరుత దాడిగా భావించారు. సంఘటన స్థల ంలో పాదముద్రలను గుర్తించి వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. బోథ్ రేంజ్ అధికారి ప్రణయ్ సిబ్బందితో కలిసి ఉద యం అక్కడికి చేరుకున్నారు. చనిపోయిన గొర్రెలను పరిశీలించారు. పాదముద్రికల ఆధారంగా ఏడాది వయసు ఉన్న చిరుత దాడి చేసినట్లుగా నిర్ధారించారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. గొర్రెల యజమాని రమేశ్‌కు రూ.4,500 సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని తెలిపారు.

'పులి సంచారం లేదు'

లక్ష్మణచాంద: తిర్పెల్లి సమీపంలో పులి సంచరిస్తుందని జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. గురువారం రాత్రి సమయంలో మండలంలోని తిర్పెల్లి అటవీ సమీపంలో పులి కనిపించిందని రైతులు తెలిపిన సమాచారం మేరకు అటవీ అధికారులు వచ్చి పరిశీలించారన్నారు. ఎక్కడ పులి సంచరించిన ఆనవాళ్లు కనిపించలేదని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం నుంచి గ్రామస్తులు సమక్షంలో అడవిలో జల్లెడపట్టామన్నారు. అయినా ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని చెప్పారు. ప్రస్తుతం పులి మామడ, దిమ్మదుర్తి రేంజ్ పరిధిలో ఉందని తెలిపారు. రోజుకు దాదాపు 25 నుంచి 50 కిలో మీటర్లు నడుస్తుందని, ఈ ప్రాంతంలోకి వచ్చే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. పశువుల కాపరులు అడవిలోకి పశువుని తీసుకెళ్లొద్దని సూచించారు.



తిర్పెల్లి సమీపంలో పులి ఆనవాళ్ల కోసం పరిశీలిస్తున్న ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, రైతులు

న్యూస్‌రీల్

కుష్ఠు సర్వే పక్కాగా నిర్వహించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు అనుమానిత కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో సర్వేకు సంబంధించి మెడికల్ ఆఫీసర్లు, నోడల్ సూపర్‌వైజర్లకు శుక్రవారం ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో గుర్తించిన వారికి మందులు అందించి వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డీపీఎంవోలు రాజేశ్వర్, గంగన్న, వైద్యులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

'ప్రజాభిప్రాయం లేకుండా పరిశ్రమ ఏర్పాటు సరికాదు'

ఖానాపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాభిప్రాయం లేకుండా ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం సరికాదని ఎన్‌హెచ్‌ఆర్‌సీ(జాతీయ మానవ హక్కుల కమిటీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఎంఏ.వకీల్ అన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు స్థానిక గ్రామపంచాయతీ అనుమతులు, నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) తీసుకోకపోవడం, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఇథనాల్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించాలని కోరారు.

ముగిసిన టెండరు ప్రక్రియ

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న టెంట్‌హౌజ్(వంటపాత్రలు, టెంట్లు) అద్దెకు ఇచ్చు హక్కు కోసం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈసందర్భంగా నలుగురు వ్యాపారులు ఈటెండర్ ప్రక్రియలో పాల్గొనగా యస్.శ్రావణ్ రూ.1.65 లక్షలకు దుకాణం దక్కించుకున్నారు. నేటి నుంచి ఏడాదిపాటు ఈదుకాణం టెండరుదారు టెంట్లు, వంటపాత్రలు అద్దెకు ఇచ్చుకునే హక్కుకు అర్హత కలిగి ఉంటారని ఈవో రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టరు రవికిషన్‌గౌడ్, గ్రామ వీడీసీ సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందించాలి

- కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారం అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న న్యూట్రి గార్డెన్స్, సామ్, మామ్ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ కేంద్రంలో న్యూట్రి గార్డెన్స్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ న్యూట్రి గార్డెన్స్‌లో పెంచిన ఆకు కూరలు, కూరగాయలను చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆహారం తయారీకి ఉపయోగించాలని సూచించారు. చిన్నారులకు క్రమం తప్పకుండా బాలామృతం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన సరుకులు మాత్రమే వాడాలన్నారు. చిన్నారులకు స్వచ్ఛమైన తాగునీరుని అందించాలన్నారు. అంగన్‌వాడీల్లో నిరంతరం పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో ఏసీడీపీవో నాగలక్ష్మి, సీడీపీవోలు నాగమణి, సరిత, సరోజిని, జిల్లా సమన్వయకర్త నిరంజన్ రెడ్డి, అన్ని మండలాల అంగన్‌వాడీల పర్యవేక్షకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి



జిల్లా కేంద్రంలో ర్యాలీగా వస్తున్న ఆశ వర్కర్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఆశ వర్కర్లకు ప్రభుత్వం ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. యూనియన్ మూడో సభలు పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం నుంచి టీఎన్జీవోస్ కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ తీశారు. అనంతరం టీఎన్జీవో సంఘ భవనంలో ఆశ వర్కర్స్ యూనియన్ మూడో జిల్లా మహాసభలు ప్రారంభించి సీనియర్ నాయకురాలు శశికళ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆశ వర్కర్లు పని ఒత్తిడి తట్టుకుని నిత్యం సేవలు అందిచడంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అవార్డులు, రివార్డ్ వచ్చాయన్నారు. కనీస వేతనం రూ.18 వేలు వచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. ప్రమాద బీమా సౌకర్యం పొందలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఆశ వర్కర్లకు జాబ్‌చార్ట్ మేరకే పనులు చేయించాలని కోరారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ మాట్లాడుతూ డిసెంబరు 15 నుంచి నిర్వహించే ఆశ వర్కర్స్ బస్సు యాత్ర నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమవుతుందని, దీనికి ముఖ్య అతిథులుగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఆశ వర్కర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి ఆల్ ఇండియా నాయకులు ఈ బస్సు యాత్రలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.కిషన్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు డి.పోశెట్టి పాల్గొన్నారు.

ఆశ వర్కర్ యూనియన్ జిల్లా కమిటీ...

నూతన అధ్యక్షురాలుగా బి.సుజాత, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, విజయ, సరిత, ఇంద్రమాల, సరిత, అనసూర్య, సుగుణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పి.గంగమణి, జిల్లా సహాయ కార్యదర్శిగా శ్యామల, సులోచన, విజయ, జ్యోతి పద్మ, విజయ, జిల్లా కోశాధికారిగా రామలక్ష్మిని ఎన్నుకున్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కడెం: రైతు సంక్షేమమే దేశ క్షేమమని, రైతాంగ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని తెలంగాణ రైతు సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేసే వరకు తాము రైతుల సమస్యలపై పోరాడుతామన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఐదో వార్షికోత్సవ సదస్సుకు తరలి రావాలని కోరారు. ఇందులో స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.


కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారుల సంఘం ప్రతినిధులు



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న టీజీవో సంఘప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా:ఇటీవల నూతనంగా ఎన్నికైన జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. నూతనంగా ఎన్నికైన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీజీ.రెడ్డి, డి.రమేశ్ నేతృత్వంలో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలులో, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చడంలో గెజిటెడ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు టీజీవో సంఘ భవనానికి స్థలానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కె.శంకర్, యు.రవికుమార్, గోదావరి, శ్రీనివాస్‌గౌడ్, రాజమల్లు, రాణి, కరుణశ్రీ, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా దివ్యాంగుల ప్రతిభ



గెలుపొందిన క్రీడాకారులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 27, 28 తేదీలలో హైదరాబాద్‌లోని జీఎంసీ బాలయోగి స్టేడియం నిర్వహించిన రాష్ట్రస్థాయి దివ్యాంగుల క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చినట్లు జిల్లా సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మూడు విభాగాల్లో ప్రథమ స్థానం, రెండు విభాగాల్లో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ముకేష్ -షార్ట్‌పుట్ మొదటి బహుమతి(ఆర్థో -సీనియర్ పురుషుల విభాగం) పి.దేవుబాయ్-చెస్‌లో మొదటి బహుమతి, జి.రాకేష్ - ట్రై సైకిల్‌లో మొదటి బహుమతి, పి.ఆనంద్‌రావ్-చెస్‌లో రెండో బహుమతి, ఏ.శ్రీవల్లి - ట్రై సైకిల్‌లో రెండో బహుమతి పొందినట్లు తెలిపారు. వీరికి దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బహుమతులు ప్రదానం చేశారని పేర్కొన్నారు.

మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారం

- ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రజలను నమ్మించి, మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై 11 నెలల్లోనే ప్రజలకు నమ్మకం పోయిందని, మళ్లీ అధికారం బీఆర్‌ఎస్‌దే అని ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం దీక్ష దివస్ నిర్వహించారు. అంతకుముందు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ నాయకుడు కేసీఆర్ చేపట్టిన అమరణ దీక్ష తెలంగాణ చరిత్ర గతినే మార్చివేసిందన్నారు. 2009, నవంబర్ 29 తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 'తెలంగాణ వచ్చుడో ..కేసీఆర్ చచ్చుడో 'అనే నినాదంతో చేపట్టిన ఆమరణ దీక్ష గొప్ప మలుపు తిప్పిందని పేర్కొన్నారు. తెలంగాణను కాంగ్రెస్ ఇవ్వలేదని, కేసీఆర్ ప్రాణాలు పణంగా పెట్టి సాధించారని గుర్తుచేశారు. దీక్షా దివస్ స్ఫూర్తితో ప్రజలు తెలంగాణ ప్రగతికి పునరంకితమై కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, సీనియర్ నాయకులు పడకంటి రామాదేవి, డాక్టర్ సుభాష్‌రావు, లోలం శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, నజీరుద్దీన్, రిజ్వాన్‌ఖాన్, సోన్ మాజీ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, దేవి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- డీఈవో రామారావు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డీఈవో

నిర్మల్ రూరల్: విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన భోజనం అందించాలని డీఈవో రామారావు ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కురన్నపేట్ అర్బన్ పాఠశాలను శుక్రవారం ఉదయం ప్రార్థన సమయంలో, సోమవార్‌పెట్ బాలికల ఉన్నత పాఠశాలను మధ్యాహ్న భోజన సమయంలో తనిఖీ చేశారు. వంటగది, వంట సామగ్రి, వంట పాత్రలను పరిశీలించి సిబ్బంది, ఏజెన్సీ నిర్వాహకులకు సూచనలు చేశారు. నాణ్యమైన బ్రాండెడ్ సరుకులనే వాడాలని ఆదేశించారు. వంట చేసేవారు తప్పనిగా సరిగా టోపీ, గ్లౌస్, ఆప్రాన్ ధరించాలని సూచించారు. ప్రతిరోజు ఫుడ్ కమిటీ ఆధ్వర్యంలో వస్తువుల నాణ్యతను పరిశీలించాలని, వంటను సభ్యులు భోజనం చేసిన తర్వాత విద్యార్థులకు వడ్డించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. జిల్లాను మూడోసారి మొదటి స్థానంలో నిలపడానికి విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. ఆయన వెంట ఎస్‌వోలు లింబాద్రి, సలోమి కరుణ, ఎంఈవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ముడారపు పరమేశ్వర్ ఉన్నారు.

నేడు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

నిర్మల్ రూరల్: ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో రామారావు తెలిపారు. 'పునరుత్పాదక/ప్రత్యామ్నాయ ఇంధన వనరులు' అనే అంశంపై జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో గెలిచిన విద్యార్థులు వచ్చే నెల 3న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

ఆర్జీయూకేటీ విద్యార్థుల ఇండస్ట్రీయల్ టూర్



హైదరాబాదులో ఆర్జీయూకేటీ విద్యార్థులు..

బాసర: బాసర ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థులు ఇండస్ట్రీయల్ టూర్‌కు వెళ్లారు. హైదరాబాద్‌లోని డీఎల్ఎఫ్, ఐఎస్‌వో రహేజా, కాగ్నిజెంట్‌తో సహా ప్రముఖ కంపెనీలను సందర్శించనున్నారు. ఆచరణాత్మక అవగాహన పొందడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ సూచించారు. అక్కడ వారికి ఉత్పత్తి ప్రక్రియలు, నాణ్యత నియంత్రణ చర్యలు, భద్రత ప్రోటోకాల్ గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. పారిశ్రామిక పర్యటనలో విద్యార్థులు మాక్ ఇంటర్వ్యూ సెషన్‌లో పాల్గొని, ఇంటర్వ్యూలకు ఎలా హాజరవ్వాలి వారి ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలనే దానిపై విలువైన చిట్కాలు పొందారు. విద్యాసంస్థలకు, పరిశ్రమలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ఇండస్ట్రీయల్ టూర్‌లు, మాక్ ఇంటర్వ్యూ సెషన్ ఉపయోగపడతాయని ఇన్‌చార్జి వీసీ తెలిపారు. కార్యక్రమంలో సృజన, శంకర్, పద్మశ్రీ, ఎన్.విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అడవిపంది దాడిలో రైతుకు గాయాలు


గాయపడ్డ రాథోడ్ రాజు

కుభీర్: మండలంలోని సిర్పెల్లి తండాకు చెందిన రైతు రాథోడ్ రాజు శుక్రవారం ఉదయం చేనులో పనులు చేస్తుండగా అడవిపంది దాడిచేసింది. కన్ను, వీపు భాగంలో తీవ్రంగా గాయపరిచింది. స్థానికులు అతడిని చికిత్స కోసం భైంసా ఆస్పత్రికి తరలించారు.

బాసర రైల్వేస్టేషన్ పార్కింగ్ షెడ్ నుంచి బైక్ చోరీ


బైక్ ఎత్తుకెళ్తున్న నిందితుల సీసీ ఫుటేజ్

బాసర: స్థానిక రైల్వేస్టేషన్ పార్కింగ్ షెడ్లోని బైక్ చోరీకి గురైంది. మండలంలోని మైలాపూర్ గ్రామానికి చెందిన మమ్మాయి గోపాల్ బాసర రైల్వేస్టేషన్లోని పార్కింగ్ షెడ్ ఎదుట గురువారం రాత్రి బైక్ను నిలిపాడు. కాసేపటికే అది చోరీకి గురి కాగా గోపాల్ ఆందోళనకు గురయ్యాడు. కాగా, గోపాల్ బైక్ను నిందితులు తీసుకెళ్తున్న దృశ్యం సీసీ ఫుటేజ్లో రికార్డయింది. బైక్ను గుర్తించినవారు 7675081647 నంబర్కు లేదా స్థానిక ఎస్సై గణేశ్కు గాని రైల్వేపోలీసులకు గాని సమాచారం ఇవ్వాలని బాధితుడు గోపాల్ కోరుతున్నాడు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

ఇచ్చోడ: మండలంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ఆచూకీ దొరికింది. వివరాలు.. అనారోగ్యంతో బాధ పడుతున్న సదరు విద్యార్థిని నాలుగు రోజుల క్రితం ఇంటికి వెళ్లింది. శుక్రవారం ఉదయం ఆమె సోదరుడు తిరిగి కళాశాలలో చేర్పించి వెళ్లిపోయాడు. కాగా, ఇదేరోజు మధ్యాహ్నం ఆమె కనిపించకుండా పోయింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ రోజారాణి స్థానిక పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతి వెంటనే కళాశాలను సందర్శించి సదరు విద్యార్థినితో సన్నిహితంగా ఉండే తోటి విద్యార్థినులతో మాట్లాడారు. రెండు పోలీసు బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్సులో ఉట్నూర్ వైపు వెళ్తున్న సదరు విద్యార్థినిని మహిళా పోలీసుల ద్వారా అదుపులోకి తీసుకుని ఇచ్చోడ పోలీస్స్టేషన్కు తీసుకువచ్చారు. సాయంత్రం కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో తక్కువ మార్కులు రావడంతోనే సదరు విద్యార్థిని మనస్తాపానికి గురై కళాశాల నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభించడంతో ఆమె తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

మొక్కు'బడి'

- క్రీడాపాఠశాలలో అరకొర చదువులు
- సరిపడా టీచర్లు లేక తిప్పలు
- స్కూల్ను వీడుతున్న విద్యార్థులు

క్రీడా పాఠశాలలోని ప్రస్తుత విద్యార్థుల సంఖ్య

తరగతి	బాలురు	బాలికలు	మొత్తం
4	18	15	33
5	11	12	23
6	16	13	29
7	09	09	18
8	11	10	21
9	07	11	18
10	09	13	22
మొత్తం	81	83	164


టీచర్ రాక వరండాలోకి వచ్చిన విద్యార్థులు


ఉపాధ్యాయుడు రాక ఖాళీగా దర్శనమిస్తున్న తరగతి గది

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోగల తెలంగాణ క్రీడా పాఠశాల తడబడుతోంది. ఈ స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారికి ఆసక్తి ఉన్న వివిధ క్రీడాంశాల్లో ప్రత్యేక తర్ఫీదునిస్తారు. ఈ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికల్లో సత్తా చాటేలా శ్రద్ధ చూపుతారు. అయితే ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. పాఠశాల పలు సందర్భాల్లో వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతూ తనదైన ప్రత్యేకతను కోల్పోతోంది. విద్యార్థులకు బోధించేందుకు పూర్తిస్థాయిలో అవసరమైన ఉపాధ్యాయుల కేటాయింపులు లేక విద్య నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతోంది. జిల్లా ఉన్నతాధికారులు కొలువై ఉండే జిల్లా కేంద్రంలోనే ఇలాంటి పరిస్థితి ఉండడం విమర్శలకు తావిస్తోంది.

బోధన కోసం పైరవీలు

2016లో ప్రారంభమైన ఈ స్పోర్ట్స్ స్కూల్లో 4 నుంచి 10 తరగతులున్నాయి. ఈ పాఠశాలలో రెగ్యులర్ టీచర్ల నియామకాలు జరగడం లేదు. దీంతో విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ప్రతీ సంవత్సరం డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి కన్నా ఎక్కువ ఉపాధ్యాయులున్న పాఠశాలల నుంచి దరఖాస్తులను స్వీకరించి డిప్యుటేషన్పై సర్దుబాటు చేస్తున్నారు. ఇక్కడే పలువురు పైరవీలకు తెరలేపుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయులతోపాటు జిల్లా కేంద్రానికి సమీపంలోని పాఠశాలల్లోని పలువురు టీచర్లు క్రీడా పాఠశాలలో బోధించేందుకు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే తీవ్ర విమర్శలున్నాయి. ఇక్కడ డిప్యుటేషన్ కోసం స్థానిక ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకురావడం, ఉపాధ్యాయ సంఘాలతో ఒత్తిడి తేవడం పరిపాటిగా మారింది. ఇటీవల ఓ టీచర్ తన దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని సీఎం కార్యాలయం నుంచి ఫోన్ చేయించడం క్షేత్రస్థాయిలో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

అరకొర చదువులు

పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కేటాయింపు జరుగుతుంది. ఈ విద్యాసంవత్సరం ఏడు స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, రెండు ఎస్జీటీలు, ఒక పీఈటీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఎన్నో వివాదాల అనంతరం ఎనిమిది మంది ఉపాధ్యాయులను కేటాయించారు. వీరిలో ప్రస్తుతం ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉండగా, ఒకే ఒక ఎస్జీటీ ఏడు పోస్టులకు గాను ఆరుగురినే నియమించారు. ఇందులో హిందీ, సాంఘిక శాస్త్రం బోధకులు లేకపోవడం గమనార్హం. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అలాగే ముగ్గురు ఎస్జీటీల అవసరం ఉండగా, ఒకే ఎస్జీటీ మాత్రమే విధులు నిర్వహిస్తుండడంతో విద్యార్థుల అభ్యసన విషయంలో నీలినీడలు కమ్ముకుంటున్నాయి. అలాగే పీఈటీని కూడా కేటాయించలేదు. ఎవరైనా ఉపాధ్యాయులు లీవ్ పెడితే తరగతులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మరోవైపు 10వ తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడం, ఒక భాష, ఒక విషయానికి సంబంధించి టీచర్లు లేకపోవడం 'పది' ఫలితాలపై ప్రభావం పడే అవకాశం లేకపోలేదు.

టీసీలు తీసుకుంటున్న వైనం

ఉపాధ్యాయుల లోటుతో అసంపూర్తి చదువుల కారణంగా విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. క్రీడా పాఠశాలలో మెరుగైన విద్య, వసతి, క్రీడా శిక్షణతో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని క్రీడా పాఠశాలలకు ప్రాధాన్యతనిస్తున్న పలువురు తల్లిదండ్రులు ఆదిలాబాద్ పాఠశాలలో జరుగుతున్న వ్యవహారంతో అసంతృప్తి వెల్లగకుతున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా వేరే పాఠశాలలో తమ పిల్లలను చేర్పించేందుకు మొగ్గుచూపుతున్నారు. పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాల సమయంలో 40 మంది బాలికలు, 40 మంది బాలురు మొత్తంగా 80 మందికి ప్రవేశం కల్పిస్తారు. విద్యాలయంలో అన్ని తరగతులకు కలిపి 280 మంది విద్యార్థులు ఉండాలి. అయితే ప్రస్తుతం 164 మంది మాత్రమే ఉండడం విద్యార్థులు టీసీలు తీసుకుంటున్నారనే దానికి బలం చేకూరుస్తోంది. ఇక పదో తరగతి విషయానికి వస్తే మరీ దారుణంగా 22 మంది మాత్రమే ఉండడం గమనార్హం. ఇప్పటికే ఈ విద్యా సంవత్సరంలో 20 మంది వరకు టీసీలు తీసుకుని వెళ్లిపోయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూమన్న తెలిపారు.

కరువైన పర్యవేక్షణ

ఇంత జరుగుతున్నా అటు విద్యాశాఖ అధికారులు, ఇటు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం భవనంపైనే క్రీడా పాఠశాల ఉన్నప్పటికీ, అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడం వారి చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. విద్యార్థులు టీసీలు తీసుకుని వేరే పాఠశాలలకు వెళ్లిపోతున్నప్పటికీ ఇందుకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. విద్యార్థుల వలసలు ఇలాగే కొనసాగితే పాఠశాల ఎత్తివేసే పరిస్థితులూ తలెత్తే అవకాశం ఉందనే అభిప్రాయాలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

బస్తీకి రాని దవాఖానాలు

- ఏడు మున్సిపాల్టీల్లో మూడే..
- తాజాగా చెన్నూర్కు మంజూరు
- పట్టణాల్లో అందని ప్రాథమిక వైద్యం
- విస్తరణకు నోచుకోని దవాఖానాలు


బెల్లంపల్లిలోని బస్తీ దవాఖానా

బెల్లంపల్లి: మున్సిపాల్టీల్లో ప్రజలకు అందుబాటులో ప్రాథమిక వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు ఏళ్లు గడుస్తున్నా కొత్త ప్రాంతాలకు విస్తరించడం లేదు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన బస్తీ దవాఖానాలు తప్ప కొత్తగా ఏర్పాటు చేసినవి లేవు. దీంతో సాధారణ జబ్బులకు సైతం రోగులు జిల్లా, ఏరియా ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తుండడంతో రద్దీ పెరిగి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బల్దియాల్లోని మురికి వాడల్లో నివసిస్తున్న పేదల కోసం బస్తీ దవాఖానాలు ప్రారంభించాల్సి ఉండగా.. ఆ దిశగా అడుగులు పడడంలేదు. జిల్లాలో ఏడు మున్సిపాల్టీలు ఉండగా.. మంచిర్యాలలోని సాయికుంట, హమాలీవాడ, బెల్లంపల్లిలో రడగంబాలబస్తీలో ఏర్పాటు చేశారు. తాజాగా చెన్నూర్ మున్సిపాల్టీకి బస్తీ దవాఖాన మంజూరు కాగా త్వరలోనే మండల ప్రజాపరిషత్ కార్యాలయ పాత భవనంలో ప్రారంభానికి వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మురికి వాడల ప్రజలు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలనే నిబంధనలు ఉన్నాయి. పేద, అట్టడుగు వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో బస్తీ దవాఖానాలు ప్రారంభిస్తున్నారు. ఒక్కో బస్తీ దవాఖానాలో వైద్యం కోసం రోజువారీగా కనిష్టంగా 50 మంది గరిష్టంగా 75మంది.. ఒక్కోసారి వంద మంది వరకు వస్తున్నట్లు సమాచారం.

ప్రాథమిక వైద్యం

ప్రభుత్వ జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో రోగుల తాకిడి తీవ్రంగా ఉంటోంది. రోజువారీగా వందలాది మంది రోగులు వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చి వెళ్తుంటారు. అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రుల్లో ఇన్పేషెంట్లుగా చేరుతున్న వారి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతోంది. జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ జబ్బులకు బస్తీ దవాఖానాల్లో ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. బస్తీ దవాఖానాలో ఎంబీబీఎస్ వైద్యుడు, స్టాఫ్నర్స్తోపాటు డాక్టర్ అసిస్టెంట్ను నియమించారు.

విస్తరణపై చిత్తశుద్ధి కరువు

బస్తీల్లో దవాఖానాల ఏర్పాటుపై చిత్తశుద్ధి కరువైంది. జనాభాకు అనుగుణంగా ప్రతీ రెండు మూడు బస్తీలకు ఒకటి చొప్పున బస్తీ దవాఖానాను ప్రారంభించాల్సి ఉండగా.. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ప్రాథమిక వైద్యం కోసం కూడా ప్రభుత్వ జిల్లా, ఏరియా ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అనివార్యమైన పరిస్థితుల్లో పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు.

కొత్త ప్రతిపాదన చేయలేదు

జిల్లాలో ప్రస్తుతం మూడు మాత్రమే బస్తీ దవాఖానాలు ఉన్నాయి. మంచిర్యాలలో రెండు, బెల్లంపల్లిలో ఒకటి చొప్పున ఏర్పాటు చేయగా కొత్తగా చెన్నూర్కు బస్తీ దవాఖానా మంజూరైంది. త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా మరే చోట బస్తీ దవాఖానాలకు ప్రతిపాదనలు చేయలేదు. కొన్ని మున్సిపాలిటీల్లో అర్బన్ హెల్త్సెంటర్లు ఉండటంతో రోగులకు వైద్యసేవలు అందుతున్నాయి.

– డాక్టర్ హరీశ్రాజ్, డీఎంహెచ్వో, మంచిర్యాల

జిల్లాలోని మున్సిపాలిటీల వివరాలు (2011 లెక్కల ప్రకారం జనాభా)

మున్సిపాలిటీ పేరు	బస్తీ దవాఖానాలు	వార్డులు	జనాభా
మంచిర్యాల	02	36	80,000
బెల్లంపల్లి	01	32	56,396
క్యాతన్పల్లి	00	22	34,000
మందమర్రి	00	24	64,000
చెన్నూర్	00	18	25,347
లక్సెట్టిపేట	00	15	26,000
నస్పూర్	00	25	76,000

ప్రజారైతు చైతన్య కార్యాచరణకు కృషి


సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

ఖానాపూర్: ప్రజలతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో భాగంగా వారిని చైతన్య పరిచేందుకు త్వరలో కార్యాచరణ రూపొందించనున్నట్లు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతు సంక్షేమానికి కృషి చేసే ప్రజానాయకులతో కలిసి త్వరలో పార్టీలకు అతీతంగా కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీలో రైతులను సభ్యులుగా చేర్చి వారికి పంట నష్టపరిహారం, నకిలీ ఎరువులు.. విత్తనాల నిర్మూలన చర్యలు, గిట్టుబాటు ధరలు తదితర అంశాలపై భవిష్యత్ కార్యాచరణతో ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 1న హైదరాబాద్లోని సుందరయ్య భవన్లో నిర్వహించనున్న సదస్సుకు రైతులు తరలిరావాలని కోరారు. న్యాయవాది పరమేశ్వర్యాదవ్, నాయకులు నర్సయ్య, అడెపు రవి, వెంకటేశ్ తదితరులున్నారు.

బ్లేడ్తో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం


బాధితుడిని అంబులెన్స్లో తరలిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: తాగిన మైకంలో బ్లేడ్తో చేయి కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం మండలకేంద్రంలోని మిలింద్నగర్లో చోటుచేసుకుంది. మిలింద్నగర్ కాలనీవాసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్లోని చిలుకూరినగర్ కాలనీకి చెందిన వ్యక్తి ఇంద్రవెల్లికి చెందిన యువతిని ప్రేమవివాహం చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ ఆదిలాబాద్లో నివసిస్తున్నారు. వీరి మధ్య మనస్పర్థలు ఏర్పడగా భార్య నెల క్రితం ఇంద్రవెల్లిలోని తల్లిదండ్రుల ఇంట్లో ఉంటోంది. దీంతో వారంరోజులుగా భర్త మద్యం తాగి భార్య వద్దకు వచ్చి గొడవపడుతున్నాడు. శుక్రవారం కూడా మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. తాగిన మైకంలో బ్లేడ్తో చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు ఎస్సై సునీల్కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని ముందుగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం 108లో ఆదిలాబాద్ రిమ్స్కు తరలించారు. దీనిపై ఎస్సైని సంప్రదించగా తాగిన మైకంలో అతడు పేరు, కుటుంబ సభ్యుల వివరాలు చెప్పడం లేదని తెలిపారు. కుటుంబీకులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

బాసర: బాసర రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద శుక్రవారం గుర్తు తెలియని వృద్ధుడు (65) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్ప డినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రి మార్చురికి తరలించినట్లు తెలిపారు. మృతుడు తెల్లని దోతి, షర్టు ధరించి ఉన్నాడని వివరించారు. మృతి చెందిన వృద్ధుడి వివరాలు తెలిసినవారు 8712649540 నంబర్కు తెలుపాలని సూచించారు.

పెట్టుబడి రాదేమోనని ఆత్మహత్య

ఆదిలాబాద్టౌన్: పంటకు పెట్టిన పెట్టుబడి రాదేమోనని మనస్తాపానికి గురైన మహారాష్ట్రకు చెందిన హన్మాండ్లు (29) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చనాక-కొరటాకు చెందిన హన్మాండ్లు పత్తి సాగుకు రూ.6లక్షల అప్పు చేశాడు. దిగుబడి రాదని దిగాలు చెంది గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

బెల్లంపల్లిరూరల్: మందమర్రి ఏరియా శాంతిఖని గని కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల బస్తీకి చెందిన ఈరబత్తుల ప్రవీణ్ (30)కు బెల్లంపల్లికి చెందిన యువతితో గత ఫిబ్రవరిలో వివాహమైంది. ఆ తర్వాత పుట్టింటికి వెళ్లిన ప్రవీణ్ భార్య మరో యువకుడితో వెళ్లిపోయింది. దీంతో ప్రవీణ్ కుమిలిపోయాడు. శాంతిఖని గనిలో యాక్టింగ్ క్లర్క్గా పని చేస్తున్న అతడు శుక్రవారం జనరల్ షిఫ్టుకు విధులకు వెళ్లాల్సి ఉండగా ఉదయం 6గంటలైనా గది నుంచి బయటకు రాలేదు. అనుమానంతో కుటుంబ సభ్యులు తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు బోరున విలపించారు. 'పవర్ ఆఫ్ బెల్లంపల్లి' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా బహుళ ప్రజాదరణ పొందిన ప్రవీణ్ మరణం అందరి హృదయాలను కలిచివేసింది. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ ఉచ్చు అమర్చిన ఇద్దరికి రిమాండ్

కోటపల్లి: వన్యప్రాణులను చంపేందుకు విద్యుత్ తీగలు అమర్చిన ఇద్దరికి రిమాండ్ విధించినట్లు ఎఫ్ఆర్వో సదానందం తెలిపారు. మండలంలోని సర్వాయిపేట అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చుతున్న సురేశ్, శంకర్ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరిని శుక్రవారం చెన్నూర్ కోర్టులో ప్రవేశపెట్టగా 12రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. అనంతరం వీరిని లక్సెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న డీఆర్వో లావణ్య, బీట్ ఆఫీసర్ అనిల్, ఎనిమల్ ట్రాకర్లు, బేస్క్యాంప్ సిబ్బందిని ఎఫ్ఆర్వో అభినందించారు.

లారీని ఢీకొన్న బైక్.. ఒకరికి గాయాలు

బోథ్: పొచ్చెర క్రాస్ సమీపంలో శుక్రవారం లారీని వెనుక నుంచి బైక్తో ఢీకొట్టిన మండలంలోని కుచులాపూర్కు చెందిన యువకుడు గాయపడ్డాడు. వివరాలు.. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి బోథ్ మండలం కుచులాపూర్ గ్రామానికి బైక్పై వస్తున్న కృష్ణంరాజు మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు సమీపంలో సిమెంట్ లోడ్తో బోథ్కు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడు గాయపడగా స్థానికులు 108లో బోథ్లోని సీహెచ్సీకి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్కు తరలించారు. కాగా, కృష్ణంరాజు తలకు హెల్మెట్ ఉండటంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఆదిలాబాద్టౌన్: మహారాష్ట్రకు చెందిన గుర్నాలే దత్తాజీ (97) రిమ్స్లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని వణి జిల్లా ఝరి తాలుకా పరిధి పీవర్డోల్ గ్రామానికి చెందిన దత్తాజీ కుటుంబీకులు ఇంట్లో ఎలుకలను చంపేందుకు ప్యాలాల్లో మందు కలిపి ఉంచారు. ఈ విషయం తెలియక దత్తాజీ వాటిని తిని అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్టౌన్: జిల్లా కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ ప్రాంతీయ కేంద్రంలో ప్రతీ ఆదివారం కౌన్సిలర్లుగా బోధించేందుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధ్యయన కేంద్రం రీజినల్ కోఆర్డినేటర్ జగ్రాం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్, హిస్టరీ, పబ్లిక్ అడ్మిన్, సోషియాలాజీ, తెలుగు, ఇంగ్లిష్, ఎంకామ్, ఉర్దూ, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో బోధించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ ప్రతులతో దరఖాస్తులను ఈనెల 30న మధ్యాహ్నం 2గంటల్లోపు ప్రాంతీయ కేంద్రంలో అందించాలన్నారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులు కలిగి ఉండాలని, వివరాలకు ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, రీజినల్ కోఆర్డినేటర్ను 9440337917, 630411616 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మన సంస్కృతిని ప్రపంచం ఆచరిస్తోంది

- జగద్గురు శంకరాచార్య భారతి స్వామీజీ


హోమం పూర్ణాహుతి కార్యక్రమంలో జగద్గురు శంకరాచార్య భారతి స్వామీజీ

కుంటాల: భారతీయ సంస్కృతి గొప్పదని, ప్రపంచం మన సంస్కృతిని ఆచరిస్తోందని హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య భారతి స్వామీజీ పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబ(బి) దత్తాత్రేయ ఆలయంలో 108 జంటలతో శుక్రవారం నిర్వహించిన మహా యజ్ఞంలో పాల్గొని భక్తులకు ప్రవచనాలు బోధించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ దేవాలయానికి వెళ్తే జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయని చెప్పారు. ఆరాటం, ఆర్భాటం లేకుండానే ధ్యానం చేస్తే సనాతన ధర్మాన్ని కాపాడిన వారమవుతామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం చేయాలని సూచించారు. ఆరోగ్యాన్ని డబ్బులతో కొనలేమని హితవు పలికారు. మానవులను ప్రేమిస్తే భగవంతుడు మనకు మేలు చేస్తాడని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తిమార్గం వైపు పయనించాలని సూచించారు. అంతకుముందు దత్తాత్రేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఉపాధ్యాయుడు లింగాల ప్రదీప్కుమార్, ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీ

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపెల్లి సీతారాములు



మాట్లాడుతున్న సీతారాములు

ఎదులాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను అమలు చేస్తూ, మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ 13వ జిల్లా మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీతో పొంచి ఉన్న ప్రమాదాన్ని ప్రజలు పసిగట్టాలన్నారు. మోదీ సర్కారు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఓ వైపు అంబేద్కర్ను పొగుడుతూనే మరో వైపు రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. స్థానికంగా మూతపడ్డ సీసీఐ ఫ్యాక్టరీని తెరిపించాలని, ఆదిలాబాద్– ఆర్మూర్ రైల్వేలైన్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇందులో మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, కార్యదర్శి వర్గ సభ్యులు రాఘవులు, కిరణ్, సచిన్, నాయకులు పాల్గొన్నారు.

బొగ్గు రవాణా వేగవంతం చేయాలి


సీహెచ్పీని పరిశీలిస్తున్న జీఎం తిరుమలరావు

శ్రీరాంపూర్: బొగ్గు రవాణాను వేగవంతం చేయాలని సింగరేణి సీహెచ్పీల జీఎం తిరుమలరావు సూచించారు. శుక్రవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని సీహెచ్పీని సందర్శించారు. ఆయన వెంట ఏరియా ఇన్చార్జి జీఎం టీ శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా తిరుమలరావు నూతనంగా ఏర్పాటు చేసిన డ్రైవ్ హెడ్ పనితీరును వీక్షించారు. దీని ద్వారా ఓసీపీ నుంచి బొగ్గు రవాణా సులభతరం కానుందని పేర్కొన్నారు. ఉద్యోగులు రక్షణతో పని చేసేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రక్షణ పరికరాలు ధరించి విధులు నిర్వహించాలని సూచించారు. ఓపెన్ కాస్టు సీహెచ్పీ నుంచి రోజుకు 4 రేకులు, శ్రీరాంపూర్ సీహెచ్పీ నుంచి 2 రేకుల బొగ్గు రవాణా చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్రెడ్డి, డీజీఎంలు కేశవరావు, చంద్రలింగం, ప్రాజెక్ట్ ఇంజినీర్ నాగరాజు ఉన్నారు.

సినిమా టెక్నాలజీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్టౌన్: రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ అకాడమీ కన్స్ట్రక్షన్ ఆఫ్ గవర్నమెంట్ తెలంగాణ సినిమా టెక్నాలజీ, స్టాఫ్వేర్ కోర్సుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సినిమాటోగ్రఫీ మాస్టారి, డిజిటల్ డిజైన్, సోషల్ మీడియా మేనేజ్మెంట్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, యాంకరింగ్, ఈఎంసీఈఈ డబ్బింగ్, వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడక్షన్ మాస్ట్రీ ప్రొఫెషనల్ ప్రొడక్షన్ మాస్టారి, ప్రొఫెషనల్ గానం శిక్షణ, డిజైనింగ్ తదితర కోర్సుల కోసం నోటిఫికేషన్ విడుదల చేసిందని పేర్కొన్నారు. మూడు నెలల కోర్సుకు సంబంధించి మూడు విడతలుగా రూ.35వేలు ఫీజు నిర్ణయించిందని తెలిపారు. శిక్షణ అనంతరం ఉపాధి కల్పిస్తూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్లో సభ్యత్వం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు డిసెంబర్ 2లోపు జిల్లా కేంద్రంలోని న్యాక్ కార్యాలయ ఇన్చార్జి ఎం.మహేశ్కుమార్ను 9154548063 నంబర్లో సంప్రదించాలని సూచించారు.